క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ అరుణకుమారి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ గిరిజన బాలికల పాఠశాల వసతి గృహంలో మంగళవారం నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో కౌమార బాలికల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి మాట్లాడుతూ.. కౌమార బాలికలలో వచ్చే మానసిక సమస్యలు, యుక్త వయసులో కలిగే ఆకర్షణల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆత్మవిశ్వాసంతో మానసిక ఒత్తిడి అధికమించి పరీక్షలలో రాణించాలన్నారు. ఆత్మ న్యూనతకులోను కారాదని చెప్పారు. పోషకాహార విలువల ప్రాధాన్యత, రక్తహీనత వంటి విషయాల గురించి పోషకాహార నిపుణురాలు తేజస్విని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐఎంఏ మహిళా విభాగం కార్యదర్శి, నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ రాణి, రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల విభాగం గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి, ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ఆరిఫా బాను తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు వేలం



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకరరెడ్డి

గూడూరు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన మున్సిపల్ వేలాలలో దినసరి కూరగాయల మార్కెట్ రూ.10లక్షల 40 వేలకు ఆదాం అనే వ్యక్తి దక్కించుకున్నాడు. గత ఏడాదికంటే అదనంగా రూ. 2 లక్షలు ఆదాయం వచ్చినట్లు కమిషనర్ వి.దివాకర రెడ్డి తెలిపారు. వారపు సంత, చిన్న కమేళ, పెద్ద కమేళ తదితర వాటిని ఈ నెల 29 వాయిదా వేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

విద్యా నైపుణ్యాలను పెంపొందించాలి



విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులలో విద్యా నైపుణ్యాలను పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రం సి.బెళగల్‌లోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాల పరిసరాలను, రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట పాత్రలు, పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఎంఈఓ వంట నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈడీ సరోజ, టీచర్లు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



పర్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

గూడూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గొడవలు, ఘర్షణలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. కె.నాగలాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని పర్లలో మంగళవారం ఎస్ఐ పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్నందున గొడవలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. అందరూ ఐక్యమత్యంగా ఉండి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానితులు సంచరిస్తున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

రేపు వికలాంగుల సింహ గర్జన

గడివేముల: ఈనెల 29వ తేదీన కర్నూలు ఎస్టీబీసీ గ్రౌండ్‌లో జరిగే వికలాంగుల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన గడివేములలో మంగళవారం సింహ గర్జన పోస్టర్లను విడుదల చేశారు. దివ్యాంగులు ఐకమత్యంగా ఉండి డిమాండ్లను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కరువై..సేవలు మాయమై!

పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవల జాడే కనిపించడం లేదు. ఈ సేవల విషయం ఎవరికీ తెలియదనే ధీమాతో వాటి యజమానులు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పెట్రోల్, డీజిల్ బంకుల్లో ఎక్కడా కూడా వినియోగదారుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కిట్లు, వాహనాలకు గాలిపట్టే యంత్రాలు కనిపించని పరిస్థితి.

పెట్రోల్ బంకుల్లో కానరాని ఉచిత సేవలు
- బంకుల యాజమాన్యాల నిర్లక్ష్యం కనిపించని ప్రథమ చికిత్స కిట్లు
- తాగునీరు, మరుగుదొడ్లకూ ఇబ్బందే
- చుట్టపుచూపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు
- ఇక్కట్లకు గురవుతున్న వినియోగదారులు

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 142 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఇందులో ఒక్క కర్నూలు నగరంలోనే 25కు పైగా ఉన్నాయి. ఎప్పుడూ చమురు కొనుగోలుదారులతో ఈ బంకులు రద్దీగా ఉంటాయి. అయితే, ఆయా బంకుల వద్ద రూల్స్ ప్రకారం పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వాహనదారులకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలి. వాహనదారులకు ఉచితంగా గాలి పట్టే యంత్రాలు ఉంచాలి. పెట్రోల్ కల్తీ జరిగిందని తెలుసుకునేందుకు లిట్మస్ పేపర్ అందుబాటులో ఉంచాలి.పెట్రోల్ సామర్థ్యంలో వినియోగదారుడికి అనుమానం వస్తే డీలర్ ఐదు లీటర్ల క్యాన్ అందుబాటులో ఉంచాలి. సేవల్లో లోపం ఉంటే ఫిర్యాదు చేసేందుకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, నైర, ఎస్సార్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్లు వినియోగదారులకు కనిపించేలా బోర్డు ఏర్పాటు చేయాలి. అయితే, ఈ నిబంధనలు ఎక్కడా కూడా అమలు కావడం లేదు. కనీసం తాగునీరు కూడా అందుబాటులో ఉంచడం లేదు. సిబ్బందికి మాత్రమే ఉపయోగపడేలా కార్యాలయ గదుల్లో మంచినీటిని ఉంచుతున్నారు. బంకుల్లో తప్పనిసరిగా మహిళలు, పరుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉంచాలి. ఒకటి, రెండు చోట్ల మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నిర్వహణ సరిగ్గా లేక వాటిలో అడుగుపెట్టలేని పరిస్థితి ఉందని వినియోగదారులు వాపోతున్నారు. కొన్నిచోట్ల బంకుల్లో మరుగుదొడ్లు ఉన్నా నిత్యం వాటికి తాళం వేసి ఉంటుంది. దీంతో ప్రధానంగా దూర ప్రాంతాల నుంచి వచ్చి పెట్రోల్ పోయించుకునే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక అత్యవసర సమయంలో మహిళల పరిస్థితి చెప్పనక్కర లేదు. చాలా బంకుల వద్ద గాలిపట్టే యంత్రాలను మొక్కుబడిగా ఉంచుతున్నారే తప్ప అవి పనిచేయని పరిస్థితి. ప్రయాణ సమయంలో అనుకోకుండా ప్రమాదం జరిగితే సమీప పెట్రోల్ బంకులో చికిత్సకు ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలి. వాటిలో మందులు ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల ఇలాంటి బాక్సులు కనిపించడం లేదు. అలాగే ఇంధన నాణ్యత, ధర, బంకుల వేళలు, నిర్వాహకుడి ఫోన్ నంబర్, అత్యవసర సేవల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలి. పెట్రోల్, డీజిల్ వేయించుంటే తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి. అయితే, జిల్లాలో ఇదెక్కడా జరగడం లేదు.

కొరవడిన ఆయిల్ కంపెనీల నిఘా

జిల్లాలో భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, నయార, ఎస్సార్ కంపెనీలు ఆయా కంపెనీల పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఇందులో వినియోగదారులకు కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా అని కూడా ఆయా కంపెనీలు చూడడం లేదు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు ఆదాయంపై ఉన్న ఆసక్తి, అందించాల్సిన సేవలపై లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బుధవారపేటలో వసతులు లేని పెట్రోల్ బంకు



ఉచిత గాలి యంత్రానికి తాళం వేసిన దృశ్యం

ఉచిత సేవలు ఎక్కడా కనిపించడం లేదు



నిబంధనల ప్రకారం కల్పించాల్సిన వసతులేవీ పెట్రోల్ బంకుల్లో కనిపించడం లేదు. ఉచిత సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా కంపెనీలు, సివిల్ సప్లయ్, తూనికలు కొలతల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. వేసవి మండుటెండల్లో పెట్రోల్ బంకుల్లో గుక్కెడు తాగునీరు కూడా లభించని పరిస్థితి. – రాము, వినియోగదారుడు, కర్నూలు

కంపెనీలకు నివేదించాం

నిబంధనల ప్రకారం ఆయా పెట్రోల్ బంకుల యజమానులు వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వినియోగదారులకు మౌలిక వసతులు కల్పించాలని భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, నయార, ఎస్సార్ కంపెనీలకు నివేదించాం. కొన్ని పెట్రోల్ బంకుల్లో తప్ప ఎక్కడా ఉచిత సేవలు అమలు చేయడం లేదు.
– ప్రసాద్, డీఎస్ఓ, కర్నూలు

తనిఖీలు ముమ్మరం చేస్తాం

పెట్రోల్ బంకులపై దాడులు ముమ్మరం చేస్తాం. వినియోగదారులకు ఆయిల్ కంపెనీలపై అనుమానం వస్తే పెట్రోల్ బంకుల్లో పెట్రోల్‌ను ఒక డ్రాప్ తీసుకుని లిట్మస్ పేపర్ ద్వారా, డీజిల్‌ను హైడ్రో మీటర్ ద్వారా సాంద్రత తెలుసుకోవచ్చు. ఇంధన సామర్థ్యం తక్కువ వస్తుందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులొస్తే తప్పకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
– చల్లా దయాకర్‌రెడ్డి, తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్, కర్నూలు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించే పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని వెంకటగిరిలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కూలీలు నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ. 272 వేతనం పడుతుందన్నారు. పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పీడీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన పనులను కూలీలకు కల్పించాలని, రోజుకు 2,000 మందికి తగ్గకుండా పని చేయించాలన్నారు. పనులు కల్పించడంలో నిర్లక్ష్యం చూపితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, విధి విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలు, వ్యవహార శైలి, అభ్యర్థుల ప్రవర్తనను పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. ద్వేషపూరిత ప్రసంగాలు, సమావేశాలు, ప్రసంగాలు, ఊరేగింపులపై దృష్టి సారించాలన్నారు. ఎంసీసీ మూడు టీమ్‌లు, ఎఫ్ఎస్‌టీ మూడు టీమ్‌లు, ఎస్ఎస్‌టీ మూడు టీమ్‌లు, వీఎస్‌టీ మూడు టీమ్‌లతో పాటు ఒక్కొక్క టీమ్‌లో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, పోలీసు ఆఫీషియల్, క్లర్క్, వీడియో గ్రాఫర్, ఒక హెల్పర్ ఉంటారని చెప్పారు. అలాగే ఫారం–6, ఫారం–7, ఫారం–8 లకు సంబంధించి ఆన్‌లైన్ క్లియరెన్స్ పురోగతిని కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ వీరశేఖర్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్ కుమార్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎలక్షన్ డీటీ ధనుంజయ, రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాష పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో కమిషనర్ వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల సూచనలను పరిగణలోకి తీసుకొని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ చేపట్టినట్లు చెప్పారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8 ఆన్‌లైన్ క్లియరెన్స్ పకడ్బందీగా చేపడుతున్నట్లు చెప్పారు. ఏవైనా సలహాలు సూచనలు ఉంటే తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో 137 నియోజకవర్గ ఏఈఆర్ఓ కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్‌కుమార్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎలక్షన్ డీటీ ధనుంజయ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సుబ్బన్న పాల్గొన్నారు.

తరగతి గదిలో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

- విద్యార్థులతో ఉపకులపతి ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు తరగతి గదిలోనే భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన వర్సిటీలోని లైఫ్ సైన్స్ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు, తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించారు. తర్వాత కొద్దిసేపు అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. 'ప్రతి ఒక్కరూ 'సమయపాలన పాటించాలి.. తరగతులకు రెగ్యులర్‌గా హాజరు కావాలి. ఆచార్యులు బోధించిన పాఠ్యాంశాలను ఆకలింపు చేసుకోవాలి. అర్థం కాని అంశాలను నివృత్తి చేసుకోవాలి. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత విభాగాధిపతి దృష్టికి తీసుకెళ్లా'లని సూచించారు. అలాగే గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో పెడతామన్నారు. ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అధ్యాపకులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం టైం టేబుల్‌ను అనుసరించాలన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పాఠ్యాంశాలు పూర్తి చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. త్వరలో ప్రారంభం కానున్న మొదటి సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశించారు.



లైఫ్‌సైన్స్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కోడుమూరు రూరల్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కేజీబీవీ స్టేట్ జాయింట్ సెక్రటరీ గీత సూచించారు. కోడుమూరులోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం జాయింట్ సెక్రటరీ గీత, జీడీడీఓ సునీత తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన వారు పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరీక్షల పట్ల ఉన్న భయాన్ని వీడి ప్రశాంతంగా చదువుకోవాలని, చక్కగా చదువుకుంటే మంచి మార్కులు సాధించవచ్చునన్నారు. టీచర్లు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గమనించి ప్రత్యేకంగా బోధించాలని ప్రిన్సిపాల్ గౌసియా బేగంకు సూచించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'



బిలకలగూడూరు ఆరోగ్య సురక్ష–2 క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



బాలుడికి వైద్య సేవలను అందిస్తున్న డాక్టర్ సునీత



గుడిపాడులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గడివేముల: రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని వైద్యాధికారిణి డాక్టర్ మొల్లా జబీన్ అన్నారు. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ మొల్లా జబీన్‌లు ప్రారంభించారు. వైద్యులు 435 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కింద వివిధ కార్పొరేట్ ఆసుపత్రిలకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఎంపీటీసీ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈర్లదిన్నెలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సి.బెళగల్: మండలంలోని ఈర్లదిన్నె సచివాలయంలో మంగళవారం అధికారులు, వైద్యులు రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ దుర్గ విజయ శ్రీ, డాక్టర్లు వాసు, వంశీ, కంటి వ్యాధి నిపుణుడు సంపత్ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన ఈఓఆర్డీ సునీత ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లతో కలిసి రోగులకు మందులు పంపిణీ చేశారు. హెల్త్ క్యాంప్‌లో 352 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ సునీత తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధికారులు ఉమామహేశ్వరి, మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్యం

గూడూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందిస్తుందని వైద్యాధికారిణి డాక్టర్ సుప్రియ పేర్కొన్నారు. గుడిపాడులోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె నిర్వహించారు. ఆమెతోపాటు జనరల్ సర్జన్ డాక్టర్ శివానీ, స్పెషలిస్టు డాక్టర్ భరత్ వినోద్, వైద్య సిబ్బంది ప్రజలకు బీపీ, షుగర్, జ్వరం, మలేరియా తదితర వైద్య పరీక్షలు చేశారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు సంతోషకరం



ఏ వ్యాధికైనా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా గ్రామంలోనే వైద్య సేవలు ఉచితంగా అందించడం సంతోషంగా ఉంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తోంది. నేను గత కొన్ని రోజుల కింద ఆరోగ్యశ్రీ కింద బైపాస్ సర్జరీ చేయించుకున్నాను. ఆరోగ్యం బాగానే ఉంది. మా ఊరిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపుకు వైద్యులు వస్తున్నారని తెలియడంతో చెకప్ చేయించుకున్నాను. అన్ని పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చారు.
–నూర్ అహమ్మద్, బిలకలగూడూరు

రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి

- పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ విభాగంలో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ–హాస్పిటల్ అమలుపై హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ మెడిసిన్, సీటీవీఎస్, మెడికల్ ఆంకాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, సైకియాట్రి, పల్మనాలజీ విభాగాలు ఆరోగ్యశ్రీ లక్ష్యాలు సాధించాయని అభినందించారు. ఈ–హాస్పిటల్‌ను సీటీవీఎస్, ఎండోక్రైనాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ఫ్యామిలీ ప్లానింగ్ విభాగాల్లో అమలు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి ఈ–హాస్పిటల్ అమలుకు వచ్చిన నిధులు ఖాతాలో జమ అయ్యాయని చెప్పారు. ఈహెచ్ఎస్ ఓపీ గురించి ఆయన ఆరా తీశారు. ఈహెచ్ఎస్ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ మేరకు అక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండేలా చూడాలని హెచ్ఓడీలకు తెలిపారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌కు పంపించే రిక్వెషన్ ఫామ్‌లో పలు ఓపీ, ఐపీ కేసులకు సంబంధించిన యూహెచ్ఐడీ 11 అంకెల నంబర్‌ను సరిగ్గా నమోదు చేయాలని చెప్పారు. ఆసుపత్రిలో ఆలస్యం కాకుండా డెత్ రిపోర్ట్‌లు త్వరగా రిపోర్టులు పంపించాలని అన్నారు. డెత్ సమ్మరిలో అన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం హెచ్ఓడీల సంతకం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. న్యూరాలజీ యూనిట్ ఐసీయూలలో మెడికల్ పీజీలను నియమించాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ శ్రీనివాసులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



గ్రామస్తులకు పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పాణ్యం : అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని, అడవులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అటవీశాఖ క్షేత్రసహాయ అధికారి సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం గోరుకల్లు గ్రామాల్లో అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవుల్లో ఎలాంటి నిప్పు వెళ్లరాదని, ఈ నిప్పు వలన వన్యప్రాణాలకు ప్రాణహాని కలుగుతుందన్నారు. కావున గిరిజనులు అడువుల సంరక్షణకు సహాయసహకారాలను అందించాలన్నారు. అలాగే కళాజాత బృందం చే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహబూబ్‌బాషా, డీఆర్ఓ చంద్రహాస్, జమాల్‌వలి, అబ్దుల్‌కలాం, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు మాజీ ఎంపీపీపై కేసు నమోదు

కర్నూలు (టౌన్) : కల్లూరు మండల మాజీ ఎంపీపీ పెద్ద అమీను, ఆయన భార్య సుగుణమ్మపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదు అయింది. కల్లూరు ఎస్టేట్ పోలీస్ కాలనీలో నివసించే వెంకటేష్‌కు, పెద్ద అమీను మధ్య ఆస్తి వివాదం గత కొంతకాలంగా నడుస్తోంది. సోమవారం ఇదే విషయంపై పెద్ద అమీను వెంకటేష్ ఇంటికి వెళ్లి గొడవ చేయడంతో పాటు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీంతో బాధితుని భార్య మీనాక్షి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌యూ హాస్టళ్ల నిర్వహణ మెరుగు పడాలి

- వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం హాస్టళ్లలో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించి నిర్వహణను మెరుగు పరచాలని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం వర్సిటీలోని మెన్, ఉమెన్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలోని వసతులు, సౌకర్యాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. మెస్ బిల్లులు విద్యార్థులకు అందుబాటులో ఉండేట్లుగా చూస్తూనే నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించాలన్నారు. వంట తయారీ గదులు, డైనింగ్ హాళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణం కల్పించాలన్నారు. వర్సిటీలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు.



వర్సిటీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్